క్లుప్తంగా

సమన్వయంతో వ్యవసాయ పథకాలు అమలు

తాళ్లూరు: ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవసాయశాఖ ద్వారా పథకాలు అమలు చేయడం సాధ్యమని వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. బొద్దికూరపాడు రైతు భరోసా కేంద్రంలో బుధవారం ప్రజాప్రతినిధులు, రైతులతో ఆయన సమావేశమయ్యారు. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్‌కు సంబంధించి రాయితీపై యంత్ర పరికరాలు పొందేందుకు సమన్వయం ఎంతో అవసరమని, అందరూ కలిసికట్టుగా పథకాల అమలు ప్రక్రియ ముందుకు తీసుకెళ్లేందుకు సహకరించాలని కోరారు. ఉప సర్పంచి పులి ప్రసాద్‌రెడ్డి, వీఆర్‌ఓ నాగేశ్వరరావు, వీఏఏ అజ్మీర్ పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపులు

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రంలో గ్రామస్తులు కలిసి పోలేరమ్మ కొలుపులు రెండు రోజులు జరుపుకుని బుధవారంతో ముగించారు. ఈ ఏడాది సంవృద్ధిగా పంటలు పండాయని, మంచి ధర వచ్చిందని, వచ్చే ఏడాది కూడా సంవృద్ధిగా పంటలు పండాలన్నారు. పిల్లా పాపలు, పాడి పంట సంవృద్ధిగా ఉండాలని గ్రామస్తులు పోలేరమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. ఆడ పడుచులు తలంటి స్నానాలు చేసి భక్తిశ్రద్ధలతో అమ్మ వారికి పొంగళ్లు వండి నైవేద్యాలు సమర్పించారు. మంగళవారం రాత్రి పోలేరమ్మకు మొక్కుబడిగా ట్రాక్టర్లతో ఊరేగింపు చేసుకుంటూ భజంత్రీలతో, మేళ తాళాలతో గ్రామస్తులు కోలాహలంగా, ఉత్సాహంగా పోలేరమ్మకు కొలుపులు జరిపించారు.

బుక్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు

యర్రగొండపాలెం: మండలంలోని వీరభద్రాపురంలో జిల్లా గ్రంథాలయ సంస్థ బుక్ డిపాజిట్ సెంటర్‌ను బుధవారం గ్రంథపాలకురాలు కె.రూనీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుక్ డిపాజిట్ సెంటర్లతో గ్రామంలోని యువతీ, యువకులు, రైతులు, విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మందుల ఆదిశేషు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్య, సర్పంచ్ ఆలేటి ఆశీర్వాదం, సొసైటీ అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు దండా శ్రీనివాసరెడ్డి, బుక్ సెంటర్ నిర్వాహకుడు జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూమిని ఆన్‌లైన్ చేయలేదని నిరసన

కురిచేడు: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన కంభంపాటి దేవసహాయం అనే రైతు తన సాగు భూమిని ఆన్‌లైన్ చేయడం లేదంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశాడు. కార్యాలయం ఎదుట ఎండలో కింద పడుకున్నాడు. తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా అతనితో మాట్లాడి కార్యాలయంలోకి తీసుకెళ్లి విచారించాడు. తహసీల్దార్ రికార్డులు పరిశీలించి సర్వేయర్‌ను భూమి పరిశీలనకు పంపారు. విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శానిటేషన్ కార్మికుల సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 70 వేల మందికిపైగా, జిల్లాలో 2 వేల మంది శానిటేషన్ కార్మికులు ఉన్నారన్నారు. శానిటేషన్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. సీఐటీయూ నాయకుడు టి.అవులయ్య పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి 7వ తేదీ వరకు తిరునాళ్ల వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు దప్పిలి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 4వ తేదీ రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం, 5న గిరిప్రదక్షణ, 6న గ్రామోత్సవం, 7న ఎడ్ల బండ పందేలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు పాదిలి కొండపై అభివృద్ధి పనుల ప్రారంభం

పొదిలి రూరల్: పొదిలికొండ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం పలు అభివృద్ధి పనులను మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. తాడికొండ వెంకట సుబ్బారావు, శేషమ్మ ఆర్థిక సహాయంతో నూతనంగా నిర్మించిన కేశఖండనశాల, దేవస్థానం, అన్నదాన సత్రాల సహకారంతో ఏర్పాటు చేసిన త్రీఫేజ్ విద్యుదీకరణ పనులను ప్రారంభిస్తారని వివరించారు. అలాగే కొండపైన స్వామి వారి గుడి దగ్గర నుంచి దిగువన అన్నదాన సత్రాల వరకు నూతన తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ముందుగా స్వామివారి జయంతి సందర్భంగా ఉదయం 8 గంటలకు పంచామృత స్నపన, తిరుమంజనం, 108 వెండి పూలతో అష్టాదశ పద్మారాదన పూజ, విశేష సహస్రనామ పూజ, 10గంటలకు శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

● వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్



వీఏఏలతో మాట్లాడుతున్న ఏడీఏ రమేష్

మద్దిపాడు: ప్రతి వీఏఏ రైతులకు అందుబాటులో ఉంటూ ఆర్‌బీకేల ద్వారా వారికి అందించే పథకాల గురించి తెలియజేస్తూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్ సూచించారు. బుధవారం మద్దిపాడు వ్యవసాయ శాఖ కార్యాలయంలో వీఏఏలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీఏఏ పొలాల్లో తిరిగి పంట నమోదు కార్యక్రమాలు చేపట్టాలని, ఆషామాషీగా పనిచేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. పంట నమోదు ప్రక్రియలో పలు కీలకమైన మార్పులను ప్రభుత్వం చేసిందని, అందువలన ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పనులు చేసుకుంటూ రికార్డులు పక్కాగా నిర్వహించాలని అన్నారు. వచ్చే రెండు వారాలలో ఉన్నతాధికారులు మద్దిపాడు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అందులన ప్రతి వీఏఏ రైతులకు క్రాప్ బుకింగ్‌కు సంబంధించిన పత్రాలు ఇచ్చి వారి సంతకాలు తీసుకోవాలన్నారు. పలు కీలమైన సూచనలు చేశారు. అనంతరం ఉద్యానవన శాఖ అధికారిణి ప్రత్యూష మాట్లాడుతూ మండలలలో నీటి వసతి ఉన్న గ్రామాల్లో లెమన్ గ్రాస్ వేసేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కే రమేష్, ఏఈవో శేషయ్య, వీఏఏలు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట

పుల్లలచెరువు: మండలంలోని ఐటీ వరంలో బుధవారం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో కోటి 30 లక్షల రూపాయలతో దేవాలయాన్ని నిర్మించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట, ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రాల మధ్య నిర్వహించగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పండితుల ఆశీర్వాదం అందుకున్నారు. మంత్రితో పాటు ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ మందా లాజర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.



మొక్కులు తీర్చుకుంటున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ముగిసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



ఏకాంత సేవలో చెన్నకేశవస్వామి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో గత 12 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. చెన్నకేశవస్వామి ఏకాంతసేవ కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా చిన్నమద్దూరి, రాజాల, బొల్లావుల, వరికూటి కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరన్, నుదురుపాటి వెంకటకృష్ణారావులు స్వామివారికి అర్చన, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంకాలమ్మ ఆలయంలో జంకె పూజలు



పూజలు చేస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: మండలంలోని వేములకోట పంచాయతీలో చెరువుకట్ట దగ్గర నారాసి అంకాలమ్మ దేవస్థాన గోపుర నిర్మాణ శంకుస్థాపన సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి బుధవారం పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో గోపుర నిర్మాణం చేపట్టినట్లు దేవస్థాన కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ట పూజలు ప్రారంభం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గణేష్ నగర్‌లో వెలసిన విజయ గణపతి దేవస్థానంలో బుధవారం విజయ గణపతి, ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ట కార్యక్రమ పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అర్చకులు రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో తొలిరోజు వేద స్వస్తి, గ్రామ ప్రదక్షిణం, ఆలయ యాగశాల సంస్కారాలు, అఖండ స్థాపన, విఘ్నేశ్వర పూజలు చేశారు. మండలానికి చెందిన ప్రముఖులు ప్రత్యేక పూజలు చేసి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి విజయ గణపతి దేవస్థానంలో ప్రతిష్టించేందుకు అవసరమైన దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా తరలించారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రముఖులు

న్యాయమూర్తి అబ్రహాంకి ఘన సన్మానం



జడ్జిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

గిద్దలూరు రూరల్: జిల్లా జడ్జిగా ఎంపికైన కొమరోలు మండల రెడ్డిచెర్ల గ్రామానికి చెందిన బందెల అబ్రహాన్ని స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం గిద్దలూరు బార్ అసోసియేషన్ సభ్యులతో పాటు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి మేరి సారాదానమ్మ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీపీ రఘునాథరావు, గిద్దలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాసిన్‌బాషా, న్యాయవాదులు హిమశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజకుమార్, పోలిరెడ్డి ఉన్నారు.

14 ఆర్బీకేల పరిధిలో యంత్రాల పంపిణీ

పొదిలి: పొదిలి మండల, నగర పంచాయతీ పరిధిలోని 17 ఆర్బీకేలకుగాను 14 ఆర్బీకేల్లో వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేసినట్లు ఏఓ ఎస్‌కే జైనులాబ్దిన్ పేర్కొన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా, బుధవారం నగర పంచాయతీ పరిధిలోని కంభాలపాడు గ్రామంలో రైతు సంఘాలకు రూ.14,76,454 విలువైన ట్రాక్టర్, నూర్పిడి యంత్రం, రోటావేటర్, గొర్రులు, నాగలి, గుంటక పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ.. యంత్రాలు పొందిన శ్రీఆంజనేయ రైతు మిత్ర గ్రూపునకు ప్రభుత్వం నుంచి రూ.5,18,400 సబ్సిడీ వచ్చిందన్నారు. మిగిలిన మూడు ఆర్బీకేల పరిధిలో వారం రోజుల్లోగా యంత్రాలు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు యంత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కంభం: మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల 2009–2011 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం కళాశాల ప్రాంగణంలో ఒక్కటయ్యారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను ఒకరిని ఒకరు పంచుకుంటూ ఆనందంగా గడిపారు. కాలేజీ చదువులు పూర్తి అయిన తర్వాత వివిధ వృత్తుల్లో కొనసాగే వారి జీవితాలను గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశానికి ప్రధానోపాధ్యాయులు కె.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

కొనకనమిట్ల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. బుధవారం నాగంపల్లి, చినమనగుండం, సలనూతల, వింజవర్తిపాడు గ్రామాల్లో కళాజాత బృందం సభ్యులు కాశీవిశ్వనాథ్, లక్ష్మి బుర్ర కథ రూపంలో సంక్షేమ పథకాలు, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు చినవెంకటరెడ్డి, వడ్లమూడి మురళీకృష్ణ, అంజనీశివకుమారి, వెంకటనారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, కార్యదర్శులు నాగార్జునరెడ్డి, కాశిం తదితరులు పాల్గొన్నారు.



పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

నాడు-నేడు పనులపై సమీక్ష

దర్శి టౌన్: మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు మే నెలాఖరులోపు పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి రఘురామయ్య కోరారు. దర్శి ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం నాడు-నేడు పనులపై ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 39 పాఠశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయని, అయా పాఠశాలల్లో వివిధ దశల్లో ఉన్న పనులు పూర్తి చెయ్యాల్సి ఉందని ఏఈ జగదీశ్వరరావు చెప్పారు. రోజూ పనులపై తగిన శ్రద్ధ తీసుకుని పూర్తయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఎంఈఓ కోరారు.



నాడు-నేడుపై సమీక్షిస్తున్న ఎంఈఓ, ఏఈ

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం స్వాతి నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసి వేస్తారు.



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

శ్రీశైలంలో బూచేపల్లి గృహ ప్రవేశం

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి, నందిని కుటుంబ సభ్యులు బుధవారం శ్రీశైలంలో నూతన గృహ ప్రవేశం నిర్వహించారు. శ్రీశైలంలో బూచేపల్లి కుటుంబం నూతనంగా నిర్మించుకున్న గృహంలో పాలు పొంగించి వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు.



గృహ ప్రవేశం చేస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు

ఉపాధి కూలీలకు పూర్తి వేతనం వచ్చేలా చూడాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి, ఎంపీపీ అరుణ

మద్దిపాడు: ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు గరిష్టంగా రూ.272 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఏపీవో ధనుంజయను ఏపీడీ వెంకటస్వామి ఆదేశించారు. మండలంలోని ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెం, నందిపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డితో కలిసి బుధవారం ఏపీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలలో ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్దేశించిన మేరకు పనులు నిర్వహిస్తే గరిష్టంగా రూ.272 వేతనం లభిస్తుందని తెలిపారు. అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వాలని, వారికి 100 రోజుల పనిదినాలు కల్పించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సైన్స్‌ను దూరం చేయడం ప్రమాదకరం



మాట్లాడుతున్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషాబాషా

● నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషాబాషా

ఒంగోలు: భావిభారత పౌరులకు సైన్స్‌ను దూరం చేయడం ప్రమాదకరమని డాక్టర్ కాలేషా బాషా అన్నారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ఒంగోలు ప్రాంతీయ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి 7వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వ విద్యా నియంత్రణ సంస్థ అయిన ఎన్‌సీఈఆర్‌టీ పదో తరగతి పాఠ్యాంశాల నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం విద్యార్థులను సైన్స్‌కు దూరం చేయడమేనని అన్నారు. బాల్యం నుంచే ప్రశ్నించే తత్వాన్ని, సృజనాత్మకశక్తిని విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, దేశభక్తిని పెంపొందించి నూతన తరాన్ని తయారు చేయాలని, అందుకు ఉపాధ్యాయులు నిరంతరం అధ్యయనం చేస్తూ సామాజిక స్పృహతో పనిచేయాలని కోరారు. ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని పెంపొందించేందుకు దాచూరి కృషిచేశారన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవి మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి కోరుకున్న శాస్త్రీయ సమాజ ఏర్పాటు కోసం పనిచేయడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో జేవీవీ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సినీ బృందం సందడి

ఒంగోలు: స్థానిక పేస్ కాలేజీలో బ్యూటీఫుల్ గర్ల్ సినిమా బృందం బుధవారం సందడి చేసింది. ఈ నెల 12న సినిమా రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా సినీ హీరో నిఖిల్ కోడాటి, హీరోయిన్ ద్రిషికో చందర్, డైరెక్టర్ రవిప్రకాష్ బోడపాటి కాలేజీకి వచ్చారు. ఈ సందర్భంగా హీరోహీరోయిన్లు మాట్లాడుతూ ఇది కష్టపడి ఇష్టంగా చేసిన సినిమా అని, దీనిని ప్రతిఒక్కరూ థియేటర్‌లోనే చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నటులతో సెల్ఫీలు దిగేందుకు యువత పోటీపడ్డారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు, ఏవో ఎం.రమణబాబు, కో ఆర్డినేటర్ బి.వి జయచంద్ర, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



పేస్ కాలేజీలో ఉన్న సినీ నటులు

రూ.4.83 కోట్లతో రోడ్డు నిర్మాణం



నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు



బేస్తవారిపేటలో నిర్మించిన సీసీ రోడ్డు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ సమీపంలోని కడప-తోకపల్లె హైవే నుంచి ఆర్.కొత్తపల్లె సమీపంలోని కోనపల్లె వరకు రూ.4.83 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఒంగోలు-నంద్యాల హైవే వరకు బేస్తవారిపేట టౌన్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, చెట్టిచర్ల, పూసలపాడు మీదుగా ఆర్.కొత్తపల్లె వరకు తారు రోడ్డును 7 కిలోమీటర్లు నిర్మించారు. నూతన రోడ్డు నిర్మాణంతో కోనపల్లె లోయ గ్రామాలకు వెళ్లేందుకు దూరం తగ్గడంతో ఆ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఒంగోలు-నంద్యాల హైవే వరకు 24 అడుగుల రోడ్డు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించారు. రోడ్డు చదును చేసి చిప్స్, డస్ట్ వేసి రోలర్ తిప్పారు. కాంట్రాక్ట్ గడువు ముగుస్తుందని నెల రోజుల క్రితం 12 అడుగుల సీసీ రోడ్డు నిర్మించారు. గృహాల ముందు కాంపౌండ్, మెట్లు తొలగించి దాదాపు నాలుగు నెలలు అవుతుండటంతో గృహస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ పూర్తి చేస్తే మెట్లు, కాంపౌండ్ నిర్మాణాలు చేసుకునేందుకు గృహస్తులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.